క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


పాణింగపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

కె.గంగవరం: పాణింగపల్లి గ్రామంలో బస్టాండ్ వద్ద గురువారం గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ చీకట్ల సునీత, సొసైటి అధ్యక్షుడు వైట్ల అచ్యుత రామ ప్రసాద్, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చీకట్ల గోపాలం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు.

చేతిపంపుల ఏర్పాటు

కపిలేశ్వరపురం: నేలటూరులోని 46, 47 అంగన్వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన రెండు చేతిపంపులను గురువారం సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షుల వీరగౌరీకుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం రూ.80 వేల మండల పరిషత్ నిధులతో చేతిపంపులను ఏర్పాటు చేశారు. చేనేత సహకార సంఘ చైర్మన్ చల్లా చినబాబు, రుద్రాక్షుల చినవీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' జమ

మండపేట: పట్టణంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు జమ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్యాలయ అధికారులు తెలిపారు. 1 నుంచి 10వ వార్డు లబ్ధిదారులకు ఉదయం 10 గంటలకు బస్టాండు వద్ద సూర్య ఫంక్షన్ హాలు, 21 నుంచి 30వ వార్డు వరకూ మధ్యాహ్నం రెండు గంటలకు బైపాస్ రోడ్డులోని విజయ ఫంక్షన్ హాలు, 11 నుంచి 20వ వార్డు పరిధిలో సాయంత్రం 4 గంటలకు సూర్య ఫంక్షన్ హాలులో సమావేశాలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆయా సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై ఆసరా సాయాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరు కావాలని ఓ ప్రకటనలో కోరారు.

వివాహిత ఫిర్యాదు

మండపేట: తన బావ వేధించినట్లు ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏడిద కొత్తూరుకు చెందిన ఓ వివాహిత శ్రీరామనవమి పండుగ కోసం మండపేటలోని పుట్టింటికి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో తన బావ ముత్యాల స్వామి ఇంటిలోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇంతలో తన తల్లి రాగా ఆమెపై దాడి చేసినట్టు బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేశారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన నవరత్నాలు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం అనపర్తి గ్రామ సచివాలయం–4 పరిధిలో, ధరణి కోట గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కలుసుకుని వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి అన్ని సందర్భాల్లో ప్రజలే అండగా ఉండాలని కోరారు. గడపగడపకూ కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికై ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి దానికి అనుగుణంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, కర్రి చినవెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి ధర్మారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, వార్డు సభ్యుడు మల్లిడి కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, చిర్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రోత్సహిస్తాం..

మండపేట: తాము అభివృద్ధిని ప్రోత్సహించే వారిమే తప్ప అడ్డుకునే వాళ్లం కాదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని ఆయన స్వగృహంలో గురువారం మీడియాతో మాట్లాడారు. విజయలక్ష్మీ నగర్‌లో మొదట అధికారపక్షం వారు బీటీ రోడ్డు ప్రతిపాదన చేస్తే సీసీ రోడ్డయితే బాగుంటుందని కౌన్సిల్ సమావేశంలో చెప్పింది తాను, టీడీపీ సభ్యులేనని ఎమ్మెల్యే వేగుళ్ల తెలిపారు.


వెదురుపాక విజయదుర్గా పీఠంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు


రాయవరం బస్టాండ్ సెంటర్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


ద్రాక్షారామ మార్కెట్‌లో సీతారాముల కల్యాణం


పట్టణంలోని కుమ్మర్లవీధి రామాలయంలో మంత్రి వేణు, ఆయన తనయుడు నరేన్ దంపతులు

సుగుణాభిరామా.. రఘుకులసోమా

- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- భక్తిభావంతో శోభిల్లిన గ్రామాలు

రాయవరం: ఆ జగదానందకారకుడి పరిణయ వేడుకను పురస్కరించుకుని శ్రీరామ నవమి వేడుకలు గురువారం అట్టహాసంగా జరిగాయి.. సుగుణాభిరాముడిని కొలుస్తూ పల్లెలు భక్తిభావంతో శోభిల్లాయి.. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏకపత్నీవ్రతుడైన శ్రీరామచంద్రుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. విజయదుర్గా పీఠంలో నవమి వేడుకల సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శ్రీరాముడు, జానకీదేవిలు లోకానికి ఆదర్శప్రాయులైనందునే వాడవాడలా రామాలయాలు వెలిశాయన్నారు. భద్రాచలం దేవస్థానం అందజేసిన సీతారామచంద్రుల ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం పీఠంలో అన్న సమారాధన జరిగింది. రాయవరం మండలంలో నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయమే సీతారామ స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ గ్రామాన ఊరేగించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి నీలమేఘశ్యాముడికి వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఆలయాల వద్ద బెల్లపు పానకాన్ని తీర్థంగా పంపిణీ చేశారు. రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, మాచవరం, పసలపూడి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి.

మండపేటలో..

మండపేట: మండపేట, మండల గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని కొండపల్లి వారి రామాలయం, వల్లూరివారి వీధిలోని రామాలయం, గొల్లలగుంట, రజక, మత్స్యకార రామాలయాలు, ఆంజనేయ స్వామివారి ఆలయం, తదితర ఆలయాల్లో దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. స్థానిక శ్రీరామక్షేత్రంలోని సీతారామ చంద్ర స్వామివారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ మళ్లిపూడి గణేశ్వర రావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఐదు వేల మందికి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీకృష్ణ తులాభారం వేడుకగా జరిగింది. మండపేట టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించామని సంఘ అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాస్ తెలిపారు.


మండపేట సీతారామ క్షేత్రంలో స్వామివారి కల్యాణ వేడుక

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: శ్రీరామనవమి వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నియోజకవర్గంలోని పలు రామాలయాలను సందర్శించి కల్యాణోత్సవాలను తిలకరించారు. పట్టణంలోని కుమ్మర్లవీధిలోని రామాలయం వద్ద జరిగిన కల్యాణ మహోత్సవంలో మంత్రి వేణు ఆయన తనయుడు నరేన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ సెంటర్లో గల సీతారామాలయం వద్ద జరిగిన సీతారాముల కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకరించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులు అందజేశారు.

రమణీయం.. రామయ్య కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. తాళ్లపొలం, జగన్నాయకులపాలెం, వెలంపాలెం, భీమక్రోసుపాలెం గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

ద్రాక్షారామ మార్కెట్‌లో..

సీతారామ బాలభక్త సమాజం(వర్తక సంఘం) ఆధ్వర్యంలో అప్పన సతీస్, లక్ష్మీనీహారిక దంపతులచే శ్రీరామచంద్రమూర్తి, సీతామహాలక్ష్మి అమ్మవార్ల దివ్య కల్యాణం వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య కమనీయంగా నిర్వహించారు.

వెలంపాలెం వేద పాఠశాలలో..

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, చంద్రశేఖర భారతీస్వామి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పాఠశాల ఆవరణలో బులుసు సోమనాథ శాస్త్రి, శేషమ్మ దంపతుల స్మారక సభావేదికపై మైలవరపు మృత్యుంజయ శాస్త్రి(బోడయ్య) బ్రహ్మత్వంలో సీతారామ కల్యాణ మహోత్సవం అశేష భక్తుల మధ్య కన్నుల పండుగగా నిర్వహించారు. చేబ్రోలు నాగేశ్వరావు, రమణమ్మ దంపతులు, పిరాట్ల సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులచే కల్యాణం నిర్వహించారు. ట్రస్టీ సభ్యులు బులుసు సీతామహాలక్ష్మి, పులవర్తి వెంకటరవిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


వెలంపాలెం వేద పాఠశాల వద్ద చలువ పందిరిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కె.గంగవరంలో..

కె.గంగవరం: సీతారాములు కల్యాణమూర్తులుగా దర్శనమించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల సీతారామాలయాల వద్ద ఉదయం నుంచి సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు,గ్రామస్తులతో కలసి ఆలయాల వద్ద పూజలు చేసి స్వామివారి కల్యాణం కన్నులపండుగగా నిర్వహించారు. యర్రపోతవరం, సత్యవాడ, పామర్రు, అముజూరు, కె.గంగవరం, దంగేరు తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.


కాగితం పువ్వులతో ఏర్పాటు చేసిన చలువపందిళ్లు


సత్యవాడలో స్వామివారి కల్యాణ వేడుక


అంగర శ్రీరాముని ఆలయంలో తోట పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: శ్రీరామనవమి వేడుకలను తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లో నిర్వహించారు. అంగరలోని చేనేత సహకార సంఘం సమీపంలో కొత్తగా నిర్మించిన శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అఖండ సాయినామ సంకీర్తన, కాకడ హారతి, అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ హాజరయ్యారు. గ్రామంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూరంపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

సుజలం.. సుఫలం


వెలగతోడులో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులు

- తీరనున్న ప్రజల నీటి కష్టాలు
- ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్
- మండపేట సబ్ డివిజన్‌లో రూ.95.42 కోట్లతో పనులు

మండపేట: నిత్యం జీవితంలో నీటిదే కీలక భూమిక.. ఆరోగ్యంతో పాటు అవసరాలకూ ఇది ఎంతో అవసరం.. అందుకే పల్లెల్లో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకు అనుగుణంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. దీనికిగాను పైపులైన్ పనులు వేగవంతం చేసింది. దీంతో ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. మండపేట సబ్ డివిజన్‌లో రెండు విడతల్లో రూ.95.42 కోట్ల విలువైన 271 పనులు పూర్తి చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

నీరు అందించేదిలా..

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) మండపేట సబ్ డివిజన్ పరిధిలో మండపేట నియోజకవర్గం మండలాలతో పాటు రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం రూరల్, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సుమారు 20 శాతం ఇళ్లకు మాత్రమే పంచాయతీ కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన వారు పబ్లిక్ కుళాయిలు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి రక్షిత మంచినీటిని అందించడం ద్వారా తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

ఏం చేస్తారంటే...

సగటున ప్రతి ఒక్కరికి రోజుకు 55 లీటర్ల నీటిని అందించే లక్ష్యంతో గ్రామాల్లో అందుబాటులో ఉన్న పథకాలను విస్తరించడం, అంతర్గత పైపులైన్ల నిర్మాణం చేస్తున్నారు. లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన చోట కొత్తగా రక్షిత మంచినీటి పథకాల పనులు చేపట్టనున్నారు. మండపేట సబ్ డివిజన్ పరిధిలో మొదటి విడత కింద రూ.55.2 కోట్ల విలువైన 181 పనులు చేపట్టారు. మండపేట మండలంలో రూ.11.28 కోట్లతో 17 పనులు చేపట్టగా, రాయవరం మండలంలో రూ.10.8 కోట్లతో 29 పనులు, కపిలేశ్వరపురం మండలంలో రూ.12.32 కోట్లతో 32 పనులు, రామచంద్రపురం మండలంలో రూ.18 కోట్లతో 51 పనులు, కె.గంగవరంలో రూ.2.8 కోట్లతో 52 పనులు చేపట్టారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 50 పనులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రెండో విడతగా రూ.40.28 కోట్లకు సంబంధించి 90 పనులు టెండర్ దశలో ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ల పనులు పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేస్తున్నారు. గ్రామాల్లో అవసరమైన చోట కొత్తగా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కష్టాలు తీర్చే దిశగా ఇంటికే కుళాయి కనెక్షన్లు ఇచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ నీరందిస్తాం..



మండపేట మండలంలో రూ.11.28 కోట్లతో 17 పనులు చేపట్టాం. మారేడుబాక, మండలంలో శివారు గ్రామాలుగా ఉన్న ఏడిద కొత్తూరు, పేకేటిపాకలు, చినద్వారపూడిలో పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. మిగిలిన గ్రామాల్లో పనులు వేగవంతం చేస్తున్నాం. అందరికీ నీరందిస్తాం.

–భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండపేట

స్వామివారి కల్యాణ వేడుకల్లో మంత్రి వేణు

కాజులూరు: మండల గ్రామాల్లో నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ, గ్రామాన సీతారామ లక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలను బాజాభజంత్రీలతో, బాణసంచా కాల్పులతో పుర వీధుల్లో ఊరేగించారు. సీతారాములను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. మండలంలోని తణుకువాడ, శలపాక, గొల్లపాలెం, మంజేరు తదితర గ్రామాల్లో ఆలయాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతరాజు బాబూరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


చీకట్లవారిపేట రామాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

గ్రామాల్లో కుటుంబ ఆరోగ్య సర్వే

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి, వెదురుమూడి గ్రామాల్లో సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ గురువారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే సంస్థ ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ సర్వేలో మండలంలోని పీహెచ్‌సీల వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై సంస్థ సూపర్‌వైజర్ కె.గోవిందయ్య మాట్లాడుతూ నిర్దేశించిన కుటుంబాలను సర్వే చేసి, ఆరోగ్య విషయాలను నమోదు చేస్తున్నామన్నారు. ఆరుగురు సభ్యుల బృందం చేపట్టిన సర్వే వివరాలను ఐఐపీఎస్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి.జుమిలాల్, హెచ్‌వీ జెస్సీ, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక పాల్గొన్నారు.


వెదురుమూడిలో సర్వే చేస్తున్న బృంద సభ్యులు

బార్ కౌన్సిల్ ఎన్నికల అధికారిగా చలపతికుమార్

- ప్రారంభమైన నామినేషన్లు
- తొలిరోజున 7 నామినేషన్లు

రామచంద్రపురం: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ చీఫ్ ఎన్నికల అధికారిగా అడ్వకేట్ చలపతికుమార్‌ను నియమించినట్టు ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిడి హరినాథ్‌రెడ్డి స్థానిక విలేకరులకు తెలిపారు. సభ్యులుగా గాడేపల్లి సత్యనారాయణ, బండి శ్రీనివాస్, వి.నరేంద్ర కుమార్‌రెడ్డి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. కాగా నామినేషన్ల తొలిరోజున 7 నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి చలపతి కుమార్ తెలిపారు. అధ్యక్ష పదవికి పిల్లి మురళీవెంకట రమణరావు ఒక నామినేషన్ వేయగా ఉపాధ్యక్ష పదవికి పలివెల సత్యనారాయణ, కార్యదర్శికి వాడ్రేవు సాయిప్రసాద్, సీహెచ్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీకి చిన్నం వీర్రెడ్డి ఆర్థిక కార్యదర్శిగా జేఎస్ఎస్ చక్రవర్తి, జూనియర్స్ అడ్వకేట్స్ రిప్రజంటేటివ్‌గా పీఎల్‌ఆర్‌పీ రామయ్య(పృధ్వి)లు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరణ ఉంటుందని, 2వ తేదీన స్క్రూటినీ, అనంతరం మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ల విత్‌డ్రా ఉంటుందన్నారు. అనంతరం 11వ తేదీన ఎన్నిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రాచీన కళలను ఆదరించాలి

రంగంపేట: హరికథ, శాస్త్రీయ నృత్యాలు తదితర ప్రాచీన కళలను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దార్ల అమ్మిరాజు అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట పాతూరులో కొలువై ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారులు ఎం.పూర్ణ బృందం, స్థానిక నృత్య బృందం ప్రదర్శించిన పోలేరమ్మ వేషధారణ అందరినీ అలరించింది. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ముళ్లపూడి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

మండపేట: వేసవిలో చల్లని మజ్జిగను పంపిణీ చేయడం ద్వారా ప్రజల దాహార్తి తీర్చేందుకు ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్‌లో సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ప్రశంసనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు బిక్కిన చక్రవర్తి మాట్లాడుతూ 17 ఏళ్లగా ఏటా శ్రీరామనవమి రోజున చలివేంద్రాన్ని ప్రారంభించి జూన్‌లో వర్షాలు మొదలయ్యే వరకూ మజ్జిగను పంపిణీ చేస్తున్నామన్నారు. పోతంశెట్టి సత్తిబాబు, యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్), సంకా శ్రీనివాసరంగా, విజ్ఞాన్ రాంబాబు, కాశిన కాశీ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామ్‌కుమార్

అర్తమూరులో నగర సంకీర్తనకు 14 ఏళ్లు

మండపేట: తెలతెలవారుతూనే భజన బృందం హరినామ సంకీర్తనలతో ఆ గ్రామం మేలుకుంటుంది. ఒకటి కాదు రెండు కాదు 14 ఏళ్లకు పైగా నగర సంకీర్తన నిరాటంకంగా కొనసాగుతోంది. ఆ గ్రామమే శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ పెదజీయర్ స్వామివారు, చినజీయర్ స్వామివారి స్వస్థలమైన అర్తమూరు. గ్రామానికి చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో 15 ఏళ్ల కిందట శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం నిర్మించారు. నాటి నుంచి నిత్య నగర సంకీర్తన ప్రారంభించారు. ద్వారంపూడి వీర్రెడ్డి ఆధ్వర్యంలో 20 నుంచి 30 మంది వరకు పురుషులు, మహిళలు, విద్యార్థులు ఉదయాన్నే హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ గ్రామంలోని ప్రతి వీధి తిరుగుతారు. ఉదయం ఐదు గంటలకు వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నుంచి మొదలైన నగర సంకీర్తన తిరిగి 6 గంటలకు ఆలయం వద్దకు చేరుకుని ముగుస్తుంది. కరోనా సమయంలో కొన్ని నెలలు మినహా ఈ ప్రక్రియ నిరాటంకంగా సాగుతోంది. ఈ సందర్భంగా గురువారం నగర సంకీర్తన 14వ వార్షికోత్సవ వేడుకలు ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవారి భక్తమండలి చైర్మన్ బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ కలియుగంలో సంసార సాగరాన్ని దాటడానికి వేదగురువులు చెప్పిన సులువైన మార్గం హరినామ సంకీర్తన అన్నారు. కార్యక్రమాన్ని నిరాటంకంగా నిర్వహిస్తున్న ద్వారంపూడి వీర్రెడ్డి, భజన బృందం సభ్యులను ఆయన అభినందించారు. కాయల సత్తిరాజు, తమలంపూడి మహాలక్ష్మి, సత్తి సుబ్బలక్ష్మి, కోనాల సత్తిరెడ్డి, ద్వారంపూడి బులి వీర్రెడ్డి, మండ వేమనరెడ్డి, చిర్ల మహాలక్ష్మి, నార్కెడమిల్లి దేవి, కొవ్వూరి తులసి, వెంకన్నబాబు పాల్గొన్నారు.


నగర సంకీర్తన చేస్తున్న భక్త బృందం